DD9 వార్త
తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 157 శనివారం, 24, 2026 , పేజీలు - 06 వెల : 3/-

**మంచిమాట**

సంపాదించే వ్యక్తి ఎన్నడూ వృథా చేయడు, వృథా చేసే వ్యక్తి ఎప్పటికీ సంపాదించలేడు.

## పార్లమెంటును రద్దు చేసిన ప్రధాని

### - 60 ఏళ్లలో ఇదే తొలిసారి!

**జపాన్:** పార్లమెంటును రద్దు చేశారు ప్రధానమంత్రి తకాయిచి. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం మూడు నెలలకే సనాయె తకాయిచి కీలక నిర్ణయం తీసుకు న్నారు. శుక్రవారం ప్రతినిధుల సభను రద్దు చేసి, ఫిబ్రవరి 8న ముందస్తు ఎన్నికలు నిర్వ హిస్తున్నట్లుగా ప్రకటించినట్లు స్థానిక మీడి యా సంస్థ పేర్కొంది. తన ఆర్థిక భద్రతా విధాన ఎజెండాకు ప్రజల మద్దతు కోరుతూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 465 మంది సభ్యులున్న దిగువ సభను రద్దు చేసి, ఈ నిర్ణయం తీసుకోవడం 60 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం

# వ్యవసాయం ఓ విజ్ఞానం

## జై కిసాన్‌కు తోడు..జై విజ్ఞాన్..జై అనుసంధాన్

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- సూర్యాపేటలో పలు కర్యాక్రమాలకు హాజరు



**సూర్యాపేట,జనవరి 23 :** 'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించి లబ్దిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో

మిగతా2లో...



## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

**తిరువనంతపురం:జనవరి 23:**

మూడు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఓ ప్యాసింజెర్ రైలును ఇవాళ ప్రధాని మోదీ ప్రారంభించారు. తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆ రైళ్లను స్టార్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం నుంచి చర్లపల్లి వరకు వచ్చే అమృత్ భారత్ రైలును కూడా ప్రారంభించారు. దీనితో పాటు నాగర్‌కోయిల్-మంగుళూరు, తిరువనంతపురం-తాంబరం మధ్య కొత్త అమృత్‌భారత్ రైళ్లు నడవనున్నాయి. త్రిసూరు నుంచి గురువాయూర్ మధ్య నడిచే ప్యాసింజెర్ రైలును కూడా ప్రారంభించారు. ఈ రైళ్ల ద్వారా కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.చర్లపల్లి నుంచి అమృత్‌భారత్ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7.15 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ రైలు బుధవారం మధ్యాహ్నం 12.45 నిమిషాలకు తిరువనంతపురం చేరుకుంటుంది. ఇక తిరువనంతపురం నుంచి ప్రతి బుధవారం సాయంత్రం 5.30 నిమిషాలకు రైలు బయలుదేరుతుంది. గురువారం రాత్రి 11.30 నిమిషాలకు ఆ రైలు చర్లపల్లి చేరుకుంటుంది.

## మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

- రూ.3 కోట్ల 70 లక్షల నిధుల విడుదల
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు



**న్యూఢిల్లీ,జనవరి 23 :** ఎట్టకేలకు మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయాన్ని అందించింది. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిధులు మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'గిరిజన సర్క్యూట్' పథకం కింద ఇప్పటికే మేడారం పరిసర

మిగతా2లో...



## టీవీ సీరియల్‌లా సాగుతున్న సిట్ విచారణ

- ఫోన్ ట్యాపింగ్ దొంగలను పట్టుకోని ప్రభుత్వం
- కెసిఆర్ కుటుంబం ఎందరి జీవితాలనో నాశనం చేసింది
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపణలు

**కరీంనగర్,జనవరి 23 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్‌లా కొనసాగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దొంగే దొంగ అన్నట్లు కేటీఆర్ వ్యవహారం ఉందన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడు తోందని విమర్శించారు. కేటీఆర్ సిరిసిల్ల

మిగతా2లో...

## తెలుగు మాట్లాడితేనే ఉద్యోగం నిబంధన రావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు




**గుంటూరు,జనవరి 23 :** తెలుగులో మాట్లాడితేనే ప్రభుత్వ ఉద్యోగం అనే ఉత్తర్వులు తీసుకురావాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. అప్పుడే అందరూ మాతృభాషను గౌరవిస్తారని చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. శుక్రవారం మంగళగిరిలో పర్యటించిన ఆయన.. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎన్నారై ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు.

మిగతా2లో...

## కల్తీ నెయ్యి కేసులో సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు

- మొత్తం 36మంది నిందితుల పేర్లు నమోదు
- నిందితుల్లో 12మంది టిటిడి ఉద్యోగులు




## చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

- ఆధారాలు, రికార్డుల ఆధారంగా కెటిఆర్ విచారణ
- సిట్ చీఫ్ సజ్జన్నార్ వెల్లడి




## ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

- సృజన్ బాగోతంతో సిట్ నోటీసులు
- రెండేళ్లయినా లీకుల వ్యావహారమేనా
- కోల్ స్కామ్‌తో కాంగ్రెస్ పతనం ఖాయం
- మీడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు




## సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చా...

- లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- లీకులను ఎవ్వరూ నమ్మకండన్న కెటిఆర్



**హైదరాబాద్,జనవరి 23 :** లీకులను ఎవ రూ నమ్మొద్దు..ఇది లీకు వీరుల ప్రభుత్వమని కెటిఆర్ ఎద్దేవా చేశారు.లీకులపై ఆధారపడి ప్రభుత్వం నడిపిస్తు న్నారని సెటైర్లు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల

మిగతా2లో...

# వ్యవసాయం ఓ విజ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కళాశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 'వ్యవసాయం ఒక విజ్ఞానమని', ఇంతకు పూర్వం దేశంలో జై జవాన్, జై కిసాన్, నినాదం ఉండేదని, ఆ తర్వాత జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం వచ్చిందని,ప్రస్తుతం ఇది జై జవాన్ ,జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ గా మారిందని తెలిపారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రైతులకు రెండు కోట్ల 47 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రోసీడింగ్స్ ను అందజేశారు. అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో 89 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 85శాతం మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. కృష్ణ ,గోదావరి జిల్లాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోమని, కృష్ణ,గోదావరి జలాల హక్కులు కాపాడుకునేందుకు ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 150 కోట్ల రూపాయలతో వ్యవసాయ కళాశాల, 50 కోట్ల రూపాయలతో కోదాడ సమీపంలో జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషమని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటీ ,ఏఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని, సాఫ్ట్ వెర్, ఐటి సెక్టార్ ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయని అన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రం గా మారిందని, వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి తెలంగాణ రైతులు దేశంలోనే ముందున్నారని, అలాగే ఇతర పంటల విషయంలో సైతం రాష్ట్ర రైతులు ముందు నిలుస్తున్నారని, ప్రత్యేకించి ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పామాయిల్ పంటలో దేశంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని, ప్రస్తుతం 10 లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు పండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నబియ్యాన్ని సాగు చేయడంతో పాటు, పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమదేనన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి ,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్తాఫ్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ వందన సమర్పణ చేయగా, పార్లమెంట్ సభ్యులు కుందూర్ రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జయవేర్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా ఎస్పీ కే. నరసింహా, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టీవీ సీరియల్‌లా సాగుతున్న సిట్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంగా అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేయించారు. ఆయన చేసిన దారుణాలతో కొన్ని కుటుంబాలు మునిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్టులు జరగవు. కేసీఆర్ కుటుంబసభ్యులను అరెస్ట్ చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని తేలిపోయింద న్నారు. దేశభద్రత కోసం జరిగే ట్యాపింగ్‌కు..తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధమే లేదు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జీల ఫోన్లు ట్యాప్ చేశారు. సిట్‌లో మంచి అధికారులు ఉన్నారు.. కానీ ప్రభుత్వం వారికి స్వేచ్ఛను ఇవ్వడం లేదన్నారు. ఈ కేసులో ఒక్క రాజకీయ నేతనైనా అరెస్ట్ చేశారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు చేపట్టేవాళ్లం. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్ట్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చాలా మంది పారిశ్రామిక వేత్తలను బెదిరించి కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. సినిమా హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేసి లాభపడ్డారని ఆరోపించారు. స్వయంగా తన ఫోన్ ట్యాప్ అయిందని సీఎం,పలువురు మంత్రులే చెప్పారన్నారు.. జడ్జిల ఫోన్లు, ప్రతిపక్ష నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని బండి సంజయ్ చెప్పారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందన్నారు బండి సంజయ్. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీఆర్ఎస్ కోట్లు వసూలు చేసిందన్నారు. ఎంత మంది ఆస్తులను జప్తు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ పోలీస్ అధికారి ప్రభాకర్ రావును కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇంత హడావుడి చేస్తున్న సిట్ ఏం సాధించిందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఒక్క రాజకీయ నేతను అరెస్ట్ చేయలేదన్నారు. కాంగ్రెస్ కొండను తవ్వి ఎలుకను పట్టుకోలేకపోతుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సిట్ విచారణ పేరుతో ప్రభుత్వం టైం పాస్ చేస్తుందన్నారు బండి సంజయ్ . స్వయంగా కేసీఆర్ కూతురే ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు. కేసీఆర్ భయానికి యాచకులు కూడా వాట్సప్ కాల్స్ మాట్లాడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే ఫోన్ ట్యాపింగ్ పై కంప్లైంట్ చేశానని బండి సంజయ్. తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన సిట్ లో ఆఫీసర్లు నిజాయితీ పరులని.. వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు బండి సంజయ్. అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేయడానికి హడావిడి చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ సర్కార్ కు లేదన్నారు బండి సంజయ్. ఏఐసీసీ ఆఫీస్ కు ..ఫాంహౌస్ కు డీల్ కుదరడం లేదని అందుకే కేసును సాగదీస్తున్నారని చెప్పారు. అన్ని ఆధారాలుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పు చేసిన పోలీసులు, అధికారులపై చర్యలు తీసుకుంటేనే ప్రజలకు నమ్మకం కల్గుతుందన్నారు బండి సంజయ్.

# చట్టప్రకారమే ట్యాపింగ్ విచారణ

**హైదరాబాద్,జనవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**

మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు శుక్రవారం హాజరైన అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ స్పందించారు. ఆధారాలు, రికార్డులు ముందుంచి కేటీఆర్‌ను విచారణ జరిపామని స్పష్టం చేశారు. సాక్ష్యులను ప్రభావితం చేయొద్దని చెప్పామని తెలిపారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పామని ప్రస్తావించారు. కేటీఆర్‌ను ఒంటరిగానే విచారించామని సజ్జనార్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేవలం భద్రతా కారణాల దృష్ట్యా మాత్రమే జరిగిందని వివరించారు. ఇందులో ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు, వ్యక్తులు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. దర్యాప్తు సంస్థకు ఇలాంటి తప్పుడు కథనాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో జరుగుతోందని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో సహా వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్ (ట్యాపింగ్), నిఘా పెట్టారనే ఆరోపణలపై తాము విచారణ చేస్తున్నామని సజ్జనార్ స్పష్టం చేశారు.

# ప్రయాణం కన్నా..ప్రాణం ముఖ్యం

**కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి**

**జాగ్రత్తగా వాహనాలు నడపాలి**

**సైబరాబాద్ సిపి ఆధ్వర్యంలో హెల్మెట్లు పంపిణీ**

**హైదరాబాద్,జనవరి 23** :మానవ ప్రాణం అమూల్యమైనదని, ప్రతీఒక్కరూ తమ ప్రాణాలతో పాటు తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈరోజు కూకట్ పల్లి రంగధాముని/ ఐడీఎల్ చెరువు వద్ద సైబరాబాద్ సీపీ సిబ్బందితో కలిసి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులను సీపీ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 'స్టార్ట్ ఎర్లీ ? గో స్లో రీచ్ సేఫ్' అనే నినాదాన్ని అందరూ ఆచరించాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఈ ప్రమాదాలు తగ్గించడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో.. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు.



సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో జనవరి 13 నుంచి 23 వరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలను వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర ప్రాంతాల్లో ప్రజలందరినీ భాగస్వాములుగా చేసుకుంటూ నిర్వహించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీసులో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం వంటి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. బాలానగర్‌లో హెచ్ఏఎల్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన 'అరైవ్ అలైవ్'లో భాగంగా కూకట్ పల్లి డీసీపీ రితీరాజ్, ఐపీఎస్., మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్య చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలన్నదే' మా లక్ష్యమన్నారు. మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ముఖ్య ఉద్దేశమన్నారు. ఓవర్ స్పీడింగ్ ప్రమాదకరమన్నారు. 20 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ ఉన్న దగ్గర 40 కిలోమీటర్ల స్పీడ్, 40 ఉన్న చోట 60 కిలోమీటర్ల వేగం, 100 కిలోమీటర్ల స్పీడ్ వెళ్లడం ప్రమాదాలకు కారణమన్నారు. కూకట్పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ ఎ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు మన కోసమే ఉన్నాయని, రోడ్డుపైకి వచ్చాక కుటుంబాన్ని గుర్తు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నెమ్మదిగా వెళ్లాలన్నారు. అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా కాలేజీలు, ఆటో ట్యాక్సీ డ్రైవర్లకు, ప్రజలకు కూడళ్ల వద్ద ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో సుమారు రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు కల్పించారు. రోడ్లు, వసతి సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు, ఇతర సదుపాయాలు కల్పించడంతో ఈ ప్రాంతాలకు పర్యాటక ఆకర్షణ మరింత పెరిగింది. సమ్మక్క – సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. రామప్ప ఆలయం, మేడారం జాతర, పరిసర అటవీ ప్రాంతాలు అన్నింటినీ కలిపి తెలంగాణ గిరిజన, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణా సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు సులభంగా మేడారం చేరుకునేలా ఏర్పాటు చేశారు.

# తెలుగు మాట్లాడితేనే ఉద్యోగం నిబంధన రావాలి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తెలుగు భాష కోసం కృషి చేసిన వారిని కొనియాడారు. రామోజీరావు ఈనాడు పత్రిక ద్వారా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. అందుకోసం ఆయన రెండు నిఘంటువులను రూపొందించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో సాంకేతిక విద్యను మాతృభాషలో అందిస్తారని చెప్పారు. అంతేకాదు వైద్యులు రోగులతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. వారికి సమయం కేటాయించి అవసరమైతేనే స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలని సూచించారు. తన తల్లి కోరిక మేరకు తాను న్యాయవాది అయినట్లు ఈ సందర్భంగా చెప్పారు. పీపీపీ విధానంలో ఎలాంటి తప్పులు లేవని,. ఇది చాలా మంచి పద్ధతి అని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు వస్తేనే ఎక్కువ మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని చెప్పారు.

# సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చా...

(మొదటి పేజీ తరువాయి)

తారక రామారావును సిట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. ఈ కేసులో కేటీఆర్‌ను అధికారులు పలు ప్రశ్నలు అడిగారు. కేటీఆర్‌ను సుమారుగా 7 గంటలకు పైగా ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న తర్వాత మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. లీకులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. కొంతమంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి.. బెదిరించామని బయట ప్రచారం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది వాస్తవమా? కాదా? అని సిట్‌ను తాను అడిగానని తెలిపారు. ఆ వార్తలు అవాస్తవమని అధికారులు చెప్పారని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై చర్యలేవీ అని తాను ప్రశ్నించానని అన్నారు. ఇప్పుడు తమ ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని అధికారులను నిలదీశానని తెలిపారు. తన ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారని విమర్శించారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో వేధించడం తప్ప.. వీళ్లు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారని ఆరోపణలు చేశారు.పారిశ్రామికవేత్తకు గన్ పెడితే సిట్ ఎందుకు వేయరు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రుల, సన్నిహితుల దోపిడీపై సిట్ వేయరా,,? అని నిలదీశారు. న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని చెప్పుకొచ్చారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తనను ఎవరితోనూ కలిపి అధికారులు విచారించలేదని చెప్పుకొచ్చారు. తాను తప్ప మరే రావు లేరని తెలిపారు. తనను విచారణకు మళ్లీ పిలుస్తామని అధికారులు అన్నారని... బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

**హైదరాబాద్,జనవరి 23** : సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది బాగోతం బయటపెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు.

# కల్తీ నెయ్యి కేసులో సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు

**అమరావతి,జనవరి 23** :తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో ఉపయోగించిన కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ఆధ్వర్యంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్తుది ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో 2019 నుంచి 2024 వరకు జరిగిన అవినీతి, కల్తీపై దర్యాప్తు చేపట్టిన సిట్.. మొత్తం 36 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో 12 మంది తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఉద్యోగులూ ఉన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న కూడా ఉన్నారు. ఇంకా 11 మంది టీటీడీ ఉద్యోగులను నిందితులుగా చేర్చడానికి టీటీడీ ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. ఎవరెవరికి ఎంత కమిషన్లు వెళ్లాయనే సమాచారంతో పాటు లావాదేవీల వివరాలనూ సిట్ సేకరించినట్టు తెలుస్తోంది. నిబంధనలు మార్చడం వెనుక ఎవరున్నారనే అంశాలపైనా ఛార్జ్‌షీట్‌లో సిట్ పేర్కొన్నట్టు సమాచారం.దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. 2019 నుంచి 2024 వరకు లడ్డూ తయారీకి రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని ఉపయోగించారని సిట్.. నిగ్గు తేల్చినట్లు ప్రచారం జరుగుతోంది. నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ తమిళనాడులోని ఏఆర్ డెయిరీకి ఇచ్చినప్పటికీ, సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ కీలక పాత్ర పోషించిందని సిట్ తన దర్యాప్తులో వెల్లడించింది. భోలేబాబా డెయిరీ యజమానులు కీలక సూత్రధారులుగా వ్యవహరించినట్లు సిట్ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.భోలేబాబా డెయిరీలో అసలు పాలు, నెయ్యి ఉత్పత్తి లేకపోయినా.. టీటీడీ అధికారులు నెయ్యి నాణ్యత బాగుందని నివేదికలు ఇచ్చారని.. తిరుమలకు వచ్చిన ట్యాంకర్లలో నెయ్యి నాణ్యతను సరిగా పరీక్షించలేదని సిట్ తేల్చింది.

# కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



**బజార్ హత్నూర్, జనవరి, 23(డిడి9వార్త న్యూస్):-** కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని 2030--31 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది.ఈ నిర్ణయం 2026 జనవరి 21న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్నారు.దీంతో అసంఘటిత రంగ కార్మికులకు 60 ఏళ్ల తర్వాత నెలవారీ పెన్షన్ లభించే భద్రత కొనసాగనుంది.

# 130 దేశీ దారు బాటిల్స్ పట్టివేత

- ఇద్దరూ వ్యక్తులపై కేసు నమోదు





**ఆదిలాబాద్ జిల్లా సోనాలా:జనవరి 23(డిడి9 వార్త న్యూస్)** సొనల మండలం లోని సంపత్ నాయక్ తండా గ్రామం లో మహారాష్ట్ర నుండి తీసుకొని వచ్చి అక్రమంగా విక్రయం చేస్తున్నారన్న సమాచారం మేరకు గ్రామంలో సోదాలు నిర్వహించగా రాథోడ్ పూల్ సింగ్, రాథోడ్ సంజు అనే ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర కి చెందిన దేశీదారు బాటిల్స్ అమ్ముతూ పట్టుబడ్డారు ఇద్దరి వ్యక్తుల దగ్గర మొత్తం 130 (90ఎశ్రీ) బాటిల్స్ లభించటం తో ఎక్ససైజ్ అధికారులు ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ ఎం. డి జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఈ దాడులలో ట్రైనీ సబ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, కార్తీక్ , సంధ్యారాణి, మయూరి, అరుణ, మంజుల పాల్గొన్నారు. ఎవరైనా గంజాయి, బెల్లం, పటిక, దేశీదారు, గుడుంబా కలిగి ఉన్న, అమ్మిన, రవాణా చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపినారు.

# ఫిట్‌నెస్ లేని స్కూల్ వాహనాలను వెంటనే సీజ్ చేయాలి



**బోధన్, నిజమాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న, ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు, వ్యాన్లను తక్షణమే సీజ్ చేయాలని పీడీఎస్‌యూ (ఎస్) జిల్లా అధ్యక్షుడు ఎన్.బాల్‌రాజ్, టీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధన్ పట్టణం, డివిజన్ పరిధిలో పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను విస్మరించి, కాలం చెల్లిన వాహనాలను రోడ్లపైకి వదులుతున్నారాని మండిపడ్డారు. గురువారం శ్రీ సాయి ప్రసన్న హైస్కూల్?కు చెందిన వ్యాన్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనను వారు ప్రస్తావిస్తూ.. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యాలు కేవలం ఫీజుల వసూళ్లపైనే దృష్టి పెడుతున్నాయని, విద్యార్థుల సంరక్షణను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. బోధన్?లో ఇలాంటి ఘటనలు పదేపదే పునరావృతమవుతున్నా అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆర్టీఓ అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఫిట్?నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# అగ్ని ప్రమాదనికి గుర్రైన ఇల్లు పరిశీలన

- కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత
- ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని హామీ.





ఆదిలాబాద్ జిల్లా : నేరడిగొండ జనవరి 23 ( డిడి9 వార్త న్యూస్)

నేరడిగొండ మండలంలోని కుప్టీ గ్రామానికి చెందిన దూల భూమన్న గారి ఇల్లు నిన్న రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురి కావడం జరిగింది విషయం తెలుసున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ అడే గజేందర్ వారి ఇంటికి వెళ్లి పరిశీలించి వారికి ఆర్థిక సాయం అందజేసారు అదేవిధంగా ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తానని హామీ ఇచ్చారు అయన వెంట స్థానిక సర్పంచ్ గోదావరి లస్మన్న మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ మందుల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, షేక్ అలీ, మురళిగౌడ్,లస్మన్న వార్డు సభ్యుల గ్రామస్తులు ఉన్నారు

# కామారెడ్డి కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవం ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం










**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త):** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల పవిత్రతను నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా పాలనాధికారి పిలుపునిచ్చారు.ఓటరు ప్రతిజ్ఞలో, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో డ్వాక్రా నిధుల గోల్‌మాల్.. విచారణకు మహిళల డిమాండ్



**బోధన్, నిజమాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
డ్వాక్రా పొదుపు సంఘం మహిళల సొమ్మును దుర్వినియోగం చేసిన రిసోర్స్ పర్సన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బోధన్ పట్టణానికి చెందిన పలువురు మహిళలు సబ్? కలెక్టరేట్?ను ఆశ్రయించారు. శుక్రవారం పట్టణంలోని 10వ వార్డు రాకాసిపేట్?కు చెందిన 'కౌండిన్య మహిళా పొదుపు సంఘం' సభ్యులు సబ్? కలెక్టర్? వికాస్ మహతో కు వినతిపత్రం అందజేశారు. బాధితుల కథనం ప్రకారం.. 2020లో తమ సంఘానికి రూ. 7.50 లక్షల బ్యాంకు రుణం మంజూరైందని మహిళలు తెలిపారు. అప్పట్లో కరోనా నిబంధనల వల్ల నేరుగా బ్యాంకుకు వెళ్లలేక, రిసోర్స్ పర్సన్ శాంతి ద్వారా నగదు చెల్లించామని చెప్పారు. అయితే, ఆ మొత్తంలో సుమారు రూ. 6 లక్షలను రిసోర్స్ పర్సన్ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని, బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో విషయం వెలుగులోకి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే పట్టణ మెప్మా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు మండిపడ్డారు. పట్టణ మెప్మా విభాగంలో ఇలాంటి అవినీతి అక్రమాలు చాలా జరుగుతున్నాయని, తమలాగే మరెంతో మంది మహిళలు ఇబ్బందులు పడు తున్నారని వారు పేర్కొన్నారు. ఆర్పీ శాంతిపై తక్షణమే విచారణ జరిపి తమ సొమ్మును తిరిగి ఇప్పిం చాలని బాధితులు సావిత్రి, ఉమా, గౌరవ్వ, మణి, భాగ్య, అరుణ, శోభా తదితరులు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులతో వాలిబాల్ ఆడి ఉత్సాహం నింపిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ







**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త):** జిల్లా కేంద్రంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, వసతి సదుపాయాలు, భోజన ఏర్పాట్లు, స్టోర్ రూమ్ తదితర అంశాలను పరిశీలిం చారు.అనంతరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న భోజన నాణ్యత, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తదుపరి పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి వాలిబాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, శారీరక దృఢత్వంతోనే మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుప రచడంతో పాటు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసిల్దార్ జనార్ధన్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సాలూరలో భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు



**బోధన్, నిజమాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల సరస్వతి దేవి మందిరంలో వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ లావణ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లే రమేష్ లు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని, అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్ఞానం, విజ్ఞానం, సృజనాత్మకతకు ప్రతీక అయిన సరస్వతీ దేవి ఆశీస్సులు విద్యార్థులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి విద్యా రంగంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, యువత తమ జ్ఞాన సంపత్తితో సమాజాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గ్రామ ప్రజలకు వసంతపంచమిశుభాకాంక్షలుతెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

# గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల సమీప డ్రైనేజీ పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త):** జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, నిజాం సాగర్ సమీపంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా పాఠశాల పరిసరాల్లో అసౌకర్యం ఏర్పడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో డ్రైనేజీ పనుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలింపజేసి, అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా పాఠశాల పరిసరాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిశుభ్రతను కట్టుదిట్టంగా పాటించాలని, డ్రైనేజీ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నేతృత్వంలో వరి సేకరణలో అగ్రస్థానం

**- కామారెడ్డి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు**





**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త):** రాష్ట్రంలోని 32 వరి సేకరణ జిల్లాల పనితీరును సివిల్ సప్లై కమిషనర్ సమీక్షించగా, సేకరణ, సయోధ్య, ఎఫ్సీఐ క్లెయిమ్‌లు తదితర ఐదు వేర్వేరు కేటగిరీల కింద అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఐదు జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి విభాగంలో మెరుగైన పనితీరు కనబరిచిన జిల్లాలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ ప్రశంసించారు. ఈ క్రమంలో రైతులకు సకాలంలో ఎమ్మెస్పీ చెల్లింపులు విభాగంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రైతులకు మూడు రోజుల్లోపు ఎమ్మెస్పీ చెల్లింపులు పూర్తిచేయడం ద్వారా జిల్లా అద్భుతమైన పనితీరును కనబరిచినందుకు, కామారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డిఎమ్. శ్రీకాంత్‌లకు పౌరసరఫరాల శాఖ మంత్రి, సీసీఎస్ చేతుల మీదుగా కమెండేషన్ సర్టిఫికెట్లు శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేట, ప్రాణహిత హాల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా డిసిఎస్వో డిఎమ్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ వారి మార్గనిర్దేశం, సంబంధిత అధికారుల సమన్వయ కృషి ఫలితంగానే కామారెడ్డి జిల్లా వరి సేకరణలో ఈ గొప్ప రాష్ట్ర స్థాయి గుర్తింపును సాధించిందని తెలిపారు.

# జువ్వాడిలో ఇందిరా మహిళ శక్తి సోలార్ ప్లాంట్ భూమి పరిశీలన





**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త):** గాంధారి మండలం జువ్వాడి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళ శక్తి సోలార్ ప్లాంట్‌కు సంబంధించి గుర్తించిన భూమిని అదనపు కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. ఈ తనిఖీలో పీడిడిఆర్డిఏ అధికారులు, గాంధారి మండల నాయబ్ తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమి విస్తీర్ణం, అనుకూలతలు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించి, ప్రాజెక్టు అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కలిగి, వారి ఆర్థిక బలోపేతానికి దోహదపడుతుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

# ఉపాధి కూలీల నోట్లో మట్టి కొడుతున్న మోడీసర్కార్

- **కేంద్రం నిధులు తగ్గించి పని దినాలు పెంచడం ఎలా సాధ్యం .**
- **మహాత్మ గాంధీ పేరు తొలగింపు రాజకీయ రాక్షస క్రీడా.**
- **పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి:కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి.**







**బోథ్ 23 జనవరి( డిడి9 వార్త న్యూస్):** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చుతూ, పని దినాల పెంపు పేరు చెప్పి నిధులు తగ్గించి ఉపాధి కూలీల కడుపులో మట్టి కొడుతున్నదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల విమర్శించారు. బోథ్ మండలంలోని ధన్నూర్ (బి) గ్రామపంచాయతీ పరిధిలోని కండిగుట్ట వద్ద ఉపాధి హామీ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలపై భారం పెంచుతూ, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, సాంకేతికత పేరుతో నిధులు నిలుపుదల చేస్తూ పలు రకాలుగా కూలీలపై భారాన్ని పెంచుతున్నారని, నూతన చట్టంలో డిమాండ్ రహిత పని విధానాన్ని, అధికారులు గ్రామాలలో పనులు సూచించడాన్ని, ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం కింద మార్చడం అంటే పార్లమెంట్ కు సంబంధం లేకుండా ఇష్టారితిన మార్పులు చేర్పులు చేసే అవకాశం ఈ ప్రభుత్వం కల్పించిందని లోపలను సవరించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో నుండి రాజకీయ దురుద్దేశం గానే మహాత్మా గాంధీ పేరును, ఉపాధి చట్టానికి తూట్లు పోలుస్తూ రాజకీయ రాక్షసక్రీడను బిజెపి ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు రాజకీయ సైద్ధాంతిక అవగాహన భావజాలాల పేరిట పేద బడుగు బలహీన వర్గాల హక్కులను కాలరాయడం మంచిది కాదని, ఉపాధి హామీ చట్టాన్ని సవరించే వరకు, పాత పద్ధతిలో కొనసాగించేంతవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

## ప్రతి ఓటూ విలువైనదే హక్కును వినియోగించుకోవాలి : అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పిలుపు

**నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దానిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేస్తామని అధికారులతో, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఈ గొప్ప హక్కును వదులుకోవద్దని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

## నిబంధనలు పాటిద్దాం - సురక్షితంగా గమ్యం చేరుదాం : జిల్లా రవాణా అధికారి పిలుపు



**నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
రహదారి నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారానే ప్రాణ రక్షణ సాధ్యమని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. శుక్రవారం నగరంలోని వినాయకనగర్‌లో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యాసదృశ్యమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులు తమ చుట్టుపక్కల వారికి ఈ విషయాలపై చైతన్యం కల్పించాలని కోరారు. అనంతరం సుమారు 500 మంది విద్యార్థులతో కలిసి వినాయకనగర్ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రుక్మిణి చాంబర్స్ చౌరస్తాకు చేరుకున్నాక, రహదారి నిబంధనలు ఉల్లంఘించబోమని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ కిరణ్ కుమార్, ఏఎంవీఐ శృతి, ఆర్టీఏ సభ్యులు రాజానరేందర్ గౌడ్, ఈడార్ మేనేజర్ వర్ష తదితరులు పాల్గొన్నారు.

## సాలూర సాయినగర్ కాలనీలో కొత్త బోరు ఏర్పాటు



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
సాలూర మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి ఎద్దడికి గ్రామ పంచాయతీ అధికారులు చెక్ పెట్టారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గుర్తించిన సర్పంచ్ తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయినగర్ కాలనీలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొత్తగా బోరు వేయించారు. గత కొంతకాలంగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు విన్నవించగా, పంచాయతీ నిధులతో యుద్ధ ప్రాతిపదికన ఈ బోరు పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి బోరు వేయించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ పటేల్, వార్డు సభ్యులు మోనెగారి రాజు, బోధన్ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్దుర్కిలో ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :**
బానిస సంకెళ్లను తెంచేందుకు ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి, బ్రిటీష్ పాలకుల గుండెల్లో వణుకు పుట్టించిన వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బోధన్ మండలం కల్దుర్కి గ్రామ నేతలు కొనియాడారు. జనని యూత్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో బోస్ జయంతి వేడుకలు మిన్నంటాయి. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి విప్లవాత్మక నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జయంతే తప్ప వర్ధంతి లేని అమరుడు నేతాజీ అని, ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన ఆ సూర్యుని స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి. జ్యోతి శంకర్, విడిసి చైర్మన్ గంగాధర్, మాజీ సర్పంచ్ మారయ్య, వార్డు సభ్యులు మరియు జనని యూత్ సభ్యులు పవన్, బాలు, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లల్‌లో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** బోధన్ మండలం బెల్లల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కవిత సూరిబాబు కుటుంబ సభ్యులు తమ ఉదారతను చాటుకున్నారు. సరస్వతీ దేవి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అక్షరాభ్యాస దినోత్సవం రోజున చదువుల తల్లి దీవెనలు విద్యార్థులకు అందాలని, ముఖ్యంగా పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఈ చిన్న ప్రయత్నం చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులకు దాతల సహకారం తోడైతే వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంచేలా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని, సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన కవిత సూరిబాబు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు.

## భీమ్‌గల్‌లో లండన్ కిడ్స్ అంతర్జాతీయ పాఠశాల ఆవిష్కరణ



**నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నారులకు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను చేరువ చేయాలనే లక్ష్యంతో భీమ్?గల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లండన్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రీ-ప్రైమరీ స్కూల్ బ్రోచర్ మరియు పోస్టర్?ను లయన్స్ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ బాబు రావు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ. అమర్?నాథ్ రావు, ఎక్స్?టెన్షన్ ఛైర్మన్ సుధీర్ బాబు హాజరై పాఠశాల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమన్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు పడాల పురంధర్ మరియు గజ్జెల చైతన్య మాట్లాడుతూ.. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ఆధునిక సాంకేతికత, క్రీడలు మరియు వినూత్న బోధనా పద్ధతుల ద్వారా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తామన్నారు. భీమ్?గల్ పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వివేకానంద బడిలో వసంత పంచమి,సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం.





**బజార్ హత్నూర్, జనవరి, 23(డిడి9వార్త న్యూస్):-** ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని వివేకానంద పాఠశాలలోశుక్రవారం రోజు వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొనాల, చుట్టు వివిధ గ్రామాల నుంచి వచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులతో హాజరై అక్షరాభ్యాసం చేయించుకున్నారు. అక్షరాభ్యాసం చేయించుకున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం 'పలక,బలపం సరస్వతి దేవి ఫోటో 'ఉచితంగా పంపిణి చేశారు. తీర్థప్రసాద వితరణ చేశారు. ఉపాధ్యాయులు వసంత పంచమి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు కృష్ణ చైతన్య, యాజమాన్య సిబ్బంది, ఇస్తారి,కోస్మెట్ శుద్ధొధన్,సుభాష్, సూర్య,శ్రీధర్,అవినాష్,హరీష్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల అధికారుల పాత్ర కీలకం

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**





**కామారెడ్డి, జనవరి 23(డిడి9 వార్త) :** మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడంలో ఎన్నికల అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమితులైన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎసస్టి,ఎఫస్టి అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నోటిఫికేషన్ జారీ నుండి ఫలితాల ప్రకటన వరకు ఎన్నికల ప్రక్రియ మొత్తానికి పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో ఎసస్టి,ఎఫస్టి,వివిటి బృందాల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, బిచ్కుంద, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలకు చెందిన అధికారులకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు తాడ్వాయి శ్రీనివాస్, నర్సింహులు, వెంకట్?లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ, చెల్లని ఓట్ల నిర్ణయం, ఎన్నికల వ్యయాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు విపులంగా వివరించారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చట్టం ప్రకారం ఓట్ల లెక్కింపు విధానం, అభ్యర్థుల సమక్షంలో పారదర్శకంగా ఫలితాల ప్రకటన జరగాల్సిన విధానాన్ని తెలియజేశారు. అలాగే, ఎన్నికల వ్యయ పరిమితులు, ఖర్చుల రిజిస్టర్ నిర్వహణ, వ్యయాల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పాత్రపై స్పష్టత ఇచ్చారు. నిర్ణయించిన పరిమితిని మించి ఖర్చు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, డీఈఓ రాజు, ఎంసీ రాజేందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శిశు మందిర్లో వసంత పంచమి -పిల్లలకు అక్షరా భ్యాసం









**బజార్ హత్నూర్, జనవరి, 23(డిడి9వార్త న్యూస్):-** వసంత పంచమి (సరస్వతి జన్మదినశీ)సందర్భంగా శుక్రవారం రోజు శ్రీ సరస్వతీ శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల బజార్ హత్నూర్లో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సరస్వతిమాతకు పూజలు చేశారు. 75 మంది చిన్నారులకు ప్రవీణ్ కుమార్ పంతులు అక్షర అభ్యాసంనుచేయించారు. కొత్తగా 62 మంది బాల బాలికలు పాఠశాలలో ప్రవేశం పొందారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా బజార్ హత్నూర్ ఉప సర్పంచ్ కొంగర్ల శారదారాజన్న,ముఖ్య వక్తగా ఆదర్శ బడి ప్రధానాచార్యులువద్యాల సంగీత పాఠశాల అధ్యక్షు లునాగనాథ్,ఉపాధ్యక్షులు కొత్తశంకర్,కార్యదర్శిరాజన్న, సహకార్యదర్శి విలాస్,సభ్యులు అంగ శ్రీకాంత్, వొర్ని వెంకట రమణ, ప్రధానాచార్యులు, ఆచార్య బృందం, పోషకులు, పాల్గొన్నారు.

# బాన్సువాడ పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**- పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
**- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**







**బాన్సువాడ, జనవరి 23(డిడి9 వార్త)** : పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసం వద్ద, సొంత స్థలాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకున్న 72 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 1 కోటి 50 లక్షల విలువైన చెక్కులను ఆయన, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు భద్రతతో కూడిన నివాస వసతి లభిస్తోందని, పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు.





**సిరికొండ 23 జనవరి( డిడి9 వార్త న్యూస్ ):** శుక్రవారం రోజు సిరికొండ మండల కేంద్రంలో గత ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న సిరికొండ కాంగ్రెస్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్లో సెమీఫైనల్ మరియు ఫైనల్ లో విజయం సాధించిన జట్టులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బహుమతులను అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్ హోరా హోరీగా తలపడిన సుంకిడి మరియు సిరికొండ జట్టులు, ఈ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన సుంకిడి జట్టు మొదటి బహుమతిగా రు,20,000/- లు నగదు గెలుపొందగా రెండవ విజేతగా నిలిచిన సిరికొండ జట్టు రు,15,000/- లు బహుమతులను ఇరు జట్లు అందుకున్నాయి. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎంపీడీవో మహమ్మద్.రైయిస?ల్ల ఖాన్,మరియు సిరికొండ సర్పంచ్ బొడ్డు.దత్త్రాత్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడ అనేది శరీరకంగానూ దృఢంగా ఉంచగలుగుతుంది, క్రీడతోపాటు ప్రతి యువకులు చదువులోనూ ముందంజలో ఉండాలని ప్రతి ఆటగాళ్లు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ సర్పంచ్ బొడ్డు. దత్త్రాత్రితో పాటు ఉప-సర్పంచ్ తోకల.రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్. ఇమామ్, మాజీ ఎంపిటిసి బగునురే.మాధవ్ పటేల్, వార్డు సభ్యులు షేక్. ఇమామ్, కాస్బే. రామారావు, బియ్యాల.రాజేశ్వర్, గోర్బండ్. సందీప్, ఎయంసి డైరెక్టర్ ప్రకాష్,సుంకిడి సర్పంచ్ రాథోడ్. గణపత్, ఉప -సర్పంచ్ భీంరావు,కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు అత్తి.సంజీవ్,ముదిరాజ్ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు కంచం.లక్ష్మణ్,రాంపూర్ సుభాష్,తోడుసం. భూపతి, వసంత్ మరియు గ్రామస్తులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకొంటూ ఏసిబికి రెడ్ హ్యాండెడ్గా చిక్కిన బజార్ హత్నూర్లో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కే. విద్యా సాగర్ రెడ్డి.

**బజార్ హత్నూర్, జనవరి, 23(డిడి9వార్త న్యూస్):-** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలో సీనియర్ సీనియర్ అసిస్టెంట్ కట్కం విద్యా సాగర్ రెడ్డి, తహసీల్దార్ బజార్హత్నూర్ కార్యాలయం, ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ వలలో చిక్కారు. శుక్రవారం సాయంత్రం 5.10 గంటలకు, ఆదిలాబాద్ జిల్లా, బజార్హత్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న నిందితుడు కట్కం విద్యా సాగర్ రెడ్డి, ఫిర్యాదుదారుడి నుండి రూ.2,00,000/- లంచం డిమాండ్ చేసిన దాంట్లో మొదటి విడతగా స్వీకరిస్తుండగా ఏసీబీ, ఆదిలాబాద్ రేంజ్ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. "బలన్?పూర్ శివారులోని సర్వే నెం. 11/అ లో ఉన్న 8.35 ఎకరాల సాదా బైనామా రిజిస్ట్రేషన్ ఫైల్?ను ప్రాసెస్ చేసి, ఫిర్యాదుదారుడి పేరు మీదకు పంపడం" అనే అధికారిక సహాయం చేయడానికి అతను లంచంతీసుకున్నాడని ఆదిలాబాద్ ఏ సి బి డి ఎస్ పి మధు తహసీల్దార్కార్యాలయం వద్ద విలేకరుల తో సమావేశశీలో వివరాలు చెప్పారు. నిందితుడి సూచన మేరకు అతని వద్ద నుంచి లంచం డబ్బులు స్వాధీనం చేసుకున్నారు.




తద్వారా, నిందితుడు తన విధులను సక్రమంగా నిర్వహించ కుండా, అనధికార ప్రయోజనం పొందాలనే దురుద్దేశంతో వ్యవహరించాడు. ఈ మేరకునిందితుడిని అరెస్టు చేసి, కరీంనగర్?లోని స్పెషల్ జడ్జి ఫర్ ఎస్పీఈ & ఏసీబీ కేసుల ముందు హాజరుపరుస్తున్నామని తెలిపారు. కేసు విచారణలో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి. సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్ ఫ్రీ నంబర్):-ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కుసంప్రదించవలసిందిగా ప్రజలకు డిఎస్పి తెలిపారు. ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్?ఫారమ్?లు వాట్సాప్ (9440446106), ఫేస్బుక్ ,గతంలో ట్విట్టర్ ద్వారా కూడా సంప్రదించవచ్చునని అన్నారు. ఏసీబీ క్యూఆర్ కోడ్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉ ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించబడిందని,బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

# పోలీసు వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

**నిజామాబాద్ రూరల్, మాక్లూర్ నూతన పోలీసు స్టేషన్ల ప్రారంభం**

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి**













**నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ, నేర నియంత్రణలో సాంకేతికతను జోడించి పోలీసు వ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతున్నామని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఐజీ చంద్రశేఖర్తో కలిసి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో సుమారు రూ. కోటి వ్యయంతో నిర్మించిన నిజామాబాద్ రూరల్ నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మాక్లూర్లో నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషన్ భవనాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నూతన భవనాలను పరిశీలించిన అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పన ద్వారా సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడుతుందన్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫ్రెండ్లీ పోలిసింగ్?ను అమలు చేస్తూనే, నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక వసతులతో కూడిన పోలీసు స్టేషన్ల ఏర్పాటు వల్ల ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయని హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ బాగుందని ఈ సందర్భంగా వారు పోలీసు అధికారులను అభినందించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన డీజీపీకి పోలీసు కమిషనర్ సాయి చైతన్య, అదనపు డీసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఏసీపీ రాజా నరేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వివిధ మండలాల ఎస్హెచ్ఓలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి : ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**- బోధన్లో లయన్స్ జనరల్ ఆసుపత్రి ప్రారంభం**








**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** పేద ప్రజలకు నామమాత్రపు రుసుముతోనే నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి ఆకాంక్షించారు. బోధన్ పట్టణంలో లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన లయన్స్ జనరల్ ఆసుపత్రిని శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. అదే స్ఫూర్తితో ఈ జనరల్ ఆసుపత్రి ద్వారా కూడా మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారుమానవత్వంతో సేవ చేయాలి: కలెక్టర్ వైద్యం అనేది వ్యాపారంలా కాకుండా మానవతా దృక్పథంతో సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అనవసర పరీక్షలు, మందులు రాయకుండా, అవసరమైన మేరకు చికిత్స అందించి అండగా నిలవాలని వైద్యులకు హితవు పలికారు. జిల్లా యంత్రాంగం తరపున స్వచ్ఛంద సంస్థలకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.అనంతరం వారు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, వార్డులను సందర్శించి అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమార్కులకు చెక్ ఇక అంతా ఆన్లైన్

**- మన ఇసుక వాహనంతో పారదర్శకతకు శ్రీకారం**

**- పైలట్ ప్రాజెక్టుగా నాలుగు జిల్లాలు ఎంపిక.. త్వరలో రాష్ట్రవ్యాప్తం**

**నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** రాష్ట్రంలో ఏళ్ల తరబడి సాగుతున్న ఇసుక అక్రమ దందాకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, వినియోగదారుడికి నేరుగా ఇసుక చేరేలా మన ఇసుక వాహనం అనే వినూత్న ఆన్?లైన్ విధానానికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ రూపకల్పన చేసింది. శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్?లో జరిగిన సమీక్షా సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్, ఎండీ భవేశ్ మిశ్రా, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి ఈ సరికొత్త వ్యవస్థను ఆవిష్కరించారు.ప్రయోగాత్మకంగా నాలుగు జిల్లాల్లో అమలుఇప్పటివరకు ఉన్న మాన్యువల్ విధానంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని సాగుతున్న దందాను అరికట్టడమే లక్ష్యంగా ఈ సాఫ్ట్?వేర్?ను రూపొందించారు. తొలి విడతగా కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. సామాన్యులకు సైతం ఇసుక లభ్యత సులభతరం చేసేలా మొబైల్ యాప్?ను అందుబాటులోకి తెచ్చారు. మన ఇసుక వాహనం యాప్ ద్వారా నిమిషాల్లో బుకింగ్ చేసుకోవచ్చు. స్మార్ట్?ఫోన్ లేని వారు




అధైర్యపడకుండా, గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తే వారు బుకింగ్ ప్రక్రియను పూర్తి చేస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇసుక విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.738 కోట్ల ఆదాయం లభించింది. ఈ కొత్త పారదర్శక విధానం ద్వారా లీకేజీలను అరికట్టడం వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ ఆదాయం రూ.1,000 కోట్ల మార్కును దాటుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఉక్కుపాదం తప్పదు: జిల్లా కలెక్టర్ హెచ్చరికకొత్త విధానం అమలులో నిర్లక్ష్యం వహించినా, అక్రమార్కులకు సహకరించినా అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. తహశీల్దార్లు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, సబ్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేసి మన ఇసుక వాహనంను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

# పదేళ్లుగా వేతనాలు లేక ఆవేదనలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందిన బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కార్మికులు ఆరోపించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరి గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ... గత టీఆర?లస్ ప్రభుత్వం నడుస్తున్న ఫ్యాక్టరీని మూసివేయగా, ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండేళ్లు గడిచినా ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2015 డిసెంబర్ 23 నుండి ఇప్పటివరకు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో పాటు, పదేళ్లుగా కంటిన్యూగా లే-ఆఫ్?లో ఉంచడం అన్యాయమని తెలిపారు. లే-ఆఫ్ మూడు నెలలు దాటిన తర్వాత సెటిల్మెంట్ చేయాల్సి ఉన్నా, మేనేజ్మెంట్ మరియు ప్రభుత్వం కలిసి కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ కూడా ఇవ్వకపోవడం దారుణమని, లేబర్ డిపార్ట్మెంట్ సహా ఏ శాఖ స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఆర?స్ లేదా ఎక్స్?గ్రేషియా ఇవ్వాల్సి ఉన్నా, మేనేజ్మెంట్ అమలు చేయడం లేదని తెలిపారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ఏర్పాటు చేసిన కమిటీ ఆచరణలో ఎలాంటి ఫలితం చూపలేదని, ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే కూడా కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు కార్మికులను అవమానించడం తగదని హెచ్చరించారు. తక్షణమే ఫ్యాక్టరీలను ప్రారంభించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లే-ఆఫ్ కాలానికి సెటిల్మెంట్ లేదా వీఆర?స్ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలు ప్రారంభమైతే బోధన్ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు హైటెక్ నైపుణ్యాలు


**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**

**విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి: ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 23(డీడీ9 వార్త) :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి హైటెక్ నైపుణ్యాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్కిల్ డెవలప్?మెంట్ ఇనీషియేటివ్ (నైపుణ్యాభివృద్ధి) కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అద్భుతమైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు, నైపుణ్యానికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జిల్లాలో స్కిల్ డెవలప్?మెంట్ కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణ తరగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎయిర్పోర్టులో బుల్లెట్ కలకలం



**హైదరాబాద్, జనవరి 23:** శంషాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయింపోర్టులో బుల్లెట్ కలకలం రేపింది. తిరుపతి నుంచి శంషాబాద్ వచ్చిన ఓ వ్యక్తి బ్యాగ్లో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ అధికారులు బుల్లెట్ను గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకున్న అనంతరం.. విచారణ నిమిత్తం ఆ వ్యక్తిని ఎయిర్పోర్టు పోలీసులకు అప్పగించారు.గతేడాది అక్టోబర్లోనూ కోల్కతా నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రయాణికుడి వద్ద సెక్యూరిటీ అధికారులు బుల్లెట్ను గుర్తించారు. ఆ ప్రయాణికుడిని విశాల్గా గుర్తించారు. అతడి బ్యాగ్?లో 38 ఎంఎం బుల్లెట్ లభ్యమైంది. విశాల్ను అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ అధికారులు.. అతడిని పోలీసులకు అప్పగించారు.
శంషాబాద్ విమానాశ్రయం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ దేశాలు, రాష్ట్రాలకు వెళ్లే సాధారణ ప్రయాణికులు, వీఐపీలు ఎయిర్?పోర్టుకు వస్తుంటారు. ఈ క్రమంలో ఎయిర్?పోర్టులో భద్రత కట్టుదిట్టంగా ఉంటుంది. ప్రతీ ప్రయాణికుడి బ్యాగ్?లను భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. తనిఖీల సందర్భంగా డ్రగ్స్, బంగారం, ఆయుధాలు బయటపడుతూ ఉంటాయి.